# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రశ్నా పత్రాల లీకేజ్, పరీక్షలలో అవకతవకల కేసులలో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- సి.జె.పి. (CJP) ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రుల సమావేశంలో పలు అంశాలను చర్చించినట్లు కేంద్రమంత్రి జె.పి.నడ్డా తెలిపారు.
- బళ్లారి - గుంతకల్లు స్టేషన్ల మధ్య మూడవ, నాలుగవ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.
- వరుసగా ఐదవ రోజు కూడా గందరగోళం కొనసాగడంతో పార్లమెంటు ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

==========================

ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అవకతవకల కేసులలో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి, కఠినమైన శిక్షలు విధించడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించింది. ప్రతిపాదిత ఈ చట్టాన్ని వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఆకాశవాణి న్యూస్‌కు కేంద్ర

ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రశ్నా పత్రాల లీకేజీపైన కఠిన చర్యలు తీసుకునే నిబంధనలతో కూడిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు నరేంద్ర మోదీ నిన్న రాత్రి విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అవకతవకలకు సంబంధించిన ముసాయిదా బిల్లు ఆమోదానికి ఎలాంటి ఆటంకం ఉండబోదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ముఖ్యమైన చర్యలు తీసుకుంటోందని కిరణ్ రిజిజు తెలియజేశారు.

===========================

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రొమేనియా దేశ అధ్యక్షుడు నికుసోర్ డాన్ సమక్షంలో ఈరోజు బుకారెస్ట్‌లో జరిగిన భారత-రొమేనియా వ్యాపార సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే `వికసిత్ భారత్ 2047` దార్శనికత లక్ష్యమని ఈ సందర్భంగా రాష్ట్రపతి తెలిపారు. భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో రొమేనియా కంపెనీలు కీలక పాత్ర పోషించాలని కోరారు. భారత్ రొమేనియా మధ్య ఇంధన భద్రత, హరిత పరివర్తన రంగాలలో సహకారానికి అపారమైన అవకాశం ఉందని రాష్ట్రపతి గుర్తు చేశారు. అదే విధంగా రసాయన ఎరువుల పరిశ్రమలో రొమేనియాకు ఉన్న సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని... ఈ రంగంలో కూడా సహకారానికి ఆస్కారం ఉందని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా... పీఎంఓ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో సి.జె.పి. (CJP) ప్రతినిధి బృందంతో ఈరోజు సమావేశమయ్యారు. సీజేపీ నుంచి జాతీయ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఈ చర్చల్లో పాల్గొన్నారు. సమావేశం అనంతరం పాత్రికేయులతో జగత్ ప్రకాష్ నడ్డా మాట్లాడుతూ... పరీక్షా విధానంలో సంస్కరణలకు సంబంధించి సి.జె.పి. లేవనెత్తిన డిమాండ్లను తాము సావధానంగా విన్నామని తెలిపారు. సి.జె.పి. మూడు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచిందని చెప్పారు. పరీక్షా ప్రశ్నా పత్రాల లీకేజీని అరికట్టడానికి కొన్ని సంస్కరణలను కూడా సూచించిందని ఆయన పేర్కొన్నారు. రేపు ఆ ప్రతినిధి బృందంతో ప్రభుత్వం మరో విడత చర్చలు జరుపుతుందని జేపీ నడ్డా తెలిపారు. ఇదిలా ఉండగా.. నీట్ పరీక్షల అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు, కేసులు ఉపసంహరించుకోవాలనే తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేశామని సి.జె.పి ప్రతినిధులు వివరించారు.

విరామం

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. కర్ణాటకలోని బళ్లారి - ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లు మధ్య మూడవ, నాలుగవ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. మొత్తం 46 కిలోమీటర్ల మార్గానికి 1,264 కోట్ల రూపాయలతో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లుగా ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనం కలగనుందన్నారు. అదే విధంగా వేదావతి నదిపై 762 మీటర్ల పొడవైన మెగా రైల్వే వంతెనను నిర్మించనున్నామని రైల్వే మంత్రి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా 3 వేల 030 కోట్ల రూపాయల వ్యయంతో దేశంలో మూడు ప్రత్యేక రసాయన పార్కుల ఏర్పాటు కోసం `భారత్ పారిశ్రామిక వికాస్ యోజన రసాయన్` (భవ్య రసాయన్) పథకానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద ఒక్కో పార్కుకు కేంద్రం వెయ్యి కోట్ల రూపాయల వరకు గ్రాంట్‌ను అందిస్తుంది.

==========================

నీట్ ప్రశ్నా పత్రం లీకేజ్, విద్యార్థుల నిరసన అంశాలపై వరుసగా ఐదవ రోజు కూడా గందరగోళం కొనసాగడంతో పార్లమెంటు ఉభయ సభలను సోమవారం వరకు వాయిదా వేశారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశమైనప్పుడు కార్గిల్ యుద్ధంలో అత్యున్నత త్యాగం చేసిన భారత సాయుధ దళాల వీర జవాన్లకు సభ నివాళి అర్పించింది. ఈ ఏడాది జులై 26న `కార్గిల్ విజయ్ దివస్` 27వ వార్షికోత్సవం జరుపుకుంటున్నామని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అనంతరం స్పీకర్ `ప్రశ్నోత్తరాల సమయం` చేపట్టడానికి ప్రయత్నించగా, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ... ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. సభ నిర్వహణలో సహకరించాలని స్పీకర్ విపక్ష సభ్యులను కోరినప్పటికీ వారు ఆయన సూచనను పాటించలేదు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ అంశంపై అర్థవంతమైన చర్చ జరగాలన్నది సభ్యులందరి ఉమ్మడి అభిప్రాయమని ఆయన అన్నారు. అయితే ప్రతిపక్షాల నిరసనలు, గందరగోళం కొనసాగుతుండడంతో వాటి మధ్యనే సభ సోమవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో ఉదయం 11 గంటలకు కార్యకలాపాలు ప్రారంభమైనప్పుడు సభ కార్గిల్ యుద్ధ అమరవీరులకు నివాళులర్పించింది. 1999 కార్గిల్ యుద్ధంలో భారతదేశం సాధించిన విజయానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటారని ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. అనంతరం ఛైర్మన్ జీరో అవర్‌ను చేపట్టేందుకు ప్రయత్నించగా ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల నిరసన అంశాన్ని లేవనెత్తారు. దీంతో ప్రతిపక్ష, అధికార పక్షాల నుంచి నిరసనలు కొనసాగుతుండటంతో సభ పలు మార్లు వాయిదా పడింది. అనంతరం డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభను సోమవారం వరకు వాయిదా వేశారు.

==========================

కేంద్ర ప్రభుత్వం వైద్య కళాశాలల సంఖ్యతో పాటు అండర్ గ్రాడ్యుయేట్ (UG), పోస్ట్ గ్రాడ్యుయేట్ (PG) సీట్ల సంఖ్యను పెంచింది. లోక్‌సభలో ఈరోజు లిఖితపూర్వక సమాధానం ద్వారా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ఈ వివరాలను వెల్లడించారు. దేశంలో 2014 నుండి ఇప్పటి వరకు వైద్య కళాశాలల సంఖ్య 387 నుండి 844కు, UG సీట్లు 51 వేల 348 నుండి లక్షా 39 వేల 489 కి, PG సీట్లు 31 వేల 185 నుండి 86 వేల 360కు పెరిగాయని అనుప్రియ పటేల్ తెలిపారు.

==========================
==========================